క్లుప్తంగా

అబాకస్ పోటీలలో భాష్యం ప్రతిభ



రేపల్లె రూరల్: అబాకస్ పోటీలలో 14 మంది ప్రతిభ సాధించటం అభినందనీయమని రేపల్లె భాష్యం స్కూల్ జోనల్ అధికారి హృదయరాజ్ అన్నారు. అబాకస్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూలులో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న 254 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా వీరిలో 56 మంది జిల్లాస్థాయి పోటీలకు వెళ్లారన్నారు. జిల్లా స్థాయిలో భాష్యం పాఠశాలల విద్యార్థులకు ఇటీవల బాపట్లలో నిర్వహించిన పోటీలో 14 మంది విద్యార్థులు ప్రతిభచాటారన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం ఇందిర అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించాలి

కమతం ఫౌండేషన్ ట్రస్టీ విజయకుమారి



రేపల్లె రూరల్: విద్యార్థుల భవిష్యత్‌పై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలని కమతం ఫౌండేషన్ ట్రస్టీ కమతం విజయకుమారి అన్నారు. మండలంలోని పిరాట్లంక జెడ్పీ హైస్కూలులో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థితికి రావాలని కోరారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులలోను, క్రీడలలోను రాణించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకరరావు, కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు, సర్పంచి రమాదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు పెరవలి విద్యార్థి




పెరవలి(వేమూరు): పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీరామ్ వాలీబాల్‌లో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సరోజిని తెలిపారు. పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న శ్రీరామ్ బాపట్ల జిల్లాలో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని ఆమె తెలిపారు. శనివారం ఎస్‌ఐ రవికృష్ణ విద్యార్థిని అభినందించారు. ఎస్‌ఐ, రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థి శ్రీరామ్‌ను పలువురు అభినందించారు.

రబీ సీజన్‌కు సాగునీరు వచ్చే అవకాశం లేదు

మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: మండలంలో రబీ సాగుకు నీరు వచ్చే అవకాశం లేదని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ శనివారం తెలిపారు. వెల్లటూరు చానల్ మరామ్మతులు జరుగుతున్నందున రెండవ పంటకు సాగు నీరు వచ్చే అవకాశం లేదని రైతులు జొన్న, మొక్కజొన్న వంటివి కాకుండా ఆరుదల పంటలైన మినుము, పెసర వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మండలంలోని గూడవల్లి, కనగాల, అరేపల్లి గ్రామాల పరిధిలో జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేసే రైతుల పరిస్థితిని గమనించి నీరు వచ్చే అవకాశం లేదు గనుక అపరాలు సాగు చేసుకోవాలని తెలిపారు. పోవడంతో టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా శనివారం కేసు నమోదైంది.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆర్ ఎస్ ఫౌండేషన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 12,13 వార్డులలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు 50 మందికి శనివారం చినరావూరులో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ పల్లె శ్యాముల్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఝాన్సీరాణి, రోహి, ప్రభాకర్, సలోమి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతోనే అన్నీ..

- యంత్ర పరికరాలతో సమయం, ఖర్చు ఆదా
- వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో హార్వెస్టర్‌తోనే కోతలు, నూర్పిళ్లు

నగరం: వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం నెలకొని ఉన్న వాతావరణ పరిస్థితులకు తోడు సమయం, ఖర్చు ఆదా అవుతుండటంతో రైతులు వ్యవసాయ యంత్రాలను వినియోగిస్తున్నారు. వరి కోతలకు, నూర్పిళ్లకు కూడా యంత్రాలను ఉపయోగించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో 28 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. వరి పంట కోతలకు సిద్ధమవ్వడంతో రైతులు పండించిన పంటను ఇంటికి చేరవేసే ప్రయత్నాలలో నిమగ్నమయ్యారు. అల్పపీడన ప్రభావంతో వరి పంటను కూలీల చేత కోయించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

■ కూలీలతో వరి కోతలు చేయిస్తే ఎకరం కోతకు రూ.5,500–6,000 ఖర్చు అవుతుంది. కోసిన పంట ఓదెలను తిప్పడం వాటి కట్టేతలకు మరో రూ.10 వేలు ఖర్చవుతుంది. తర్వాత నూర్పిళ్లకి మరో రూ.10,000 ఖర్చు చేస్తేనే ధాన్యం ఇంటికి చేరుతుంది. ఈ ప్రక్రియకు వాతావరణం అనుకూలిస్తే వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. కానీ గత కొన్ని రోజుల నుంచి వాతావరణంలో మార్పులు రైతన్నలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో రైతులు యంత్ర పరికరాల వైపు మొగ్గు చూపుతున్నారు.

సమయం, ఖర్చు ఆదా

వరి పంట కోతలో యంత్రాలను వినియోగించడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వరి కోత, నూర్పిడి (హార్వెస్టర్)తో ఎకరం వరి పంటను గంటన్నరలో పూర్తవుతుందని, దీనికి రూ.3 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ యంత్రంతో రెండు గంటల వ్యవధిలోనే ధాన్యాన్ని ఇంటికి తీసుకెళ్ల గలుగుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. సాధారణంగా వరి కోత కోయడం, ఓదెలు తిప్పడం, కట్టేతలు కట్టి తర్వాత నూర్పిడికి ఎకరానికి దాదాపు రూ.20 వేలకు పైనే ఖర్చు అవుతుందని దీనికి సుమారు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుందని ఈ తతంగం ఏమి లేకుండా హార్వెస్టర్‌తో ఒక రోజులో రెండు గంటల వ్యవధిలోనే ధాన్యం ఇంటికి చేరుతుండటంతో యంత్రాలను వినియోగిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



పూడివాడలో హార్వెస్టర్‌తో వరి పంటను కోయిస్తున్న రైతులు



వరి నూర్పిడి యంత్రం

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న యాజలి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు



భట్టిప్రోలు హైస్కూల్‌లోని మీటింగ్‌లో సర్పంచ్ రవికిరణ్మయి, ఉప సర్పంచ్, హెచ్‌ఎం



భట్టిప్రోలు మండలం పెసర్లంక హైస్కూల్‌లోని ముగ్గుల పోటీల్లో ఎంపీపీ లలిత కుమారి

కర్లపాలెం: తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కలసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చెయ్యాలని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అన్నారు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంయుక్త సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

భట్టిప్రోలు మండలంలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్స్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పాల్గొన్నారు. తల్లులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్‌బాషా, సర్పంచ్ వేములపల్లి శ్రీరంజని, ఎస్‌ఎంసీ చైర్మన్ డి.శ్రీను, గ్రామ పెద్దలు వేములపల్లి వీరాంజనేయులు పాల్గొన్నారు. టీఎంరావు హైస్కూల్‌లో తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎ.సుగుణకుమారి, హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, దారా చెన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భట్టిప్రోలు ఎల్‌ఈ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పాగోలు చినబాబు, హెచ్‌ఎం గుర్రం వెంకట సుబ్బారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ వేము శ్రీవాణి, వైస్ చైర్మన్ కనపర్తి కోటి పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎడ్యుకేట్, ఎంగేజ్, ఎంపవర్, విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాలు, సమస్యలు, ప్రవర్తన, క్రీడలు, కళలపై ఈ సమావేశాలలో చర్చించినట్లు ఎంఈవోలు పి.లాజర్, ఎస్.దేవరాజులు తెలిపారు.

విద్యా వ్యవస్థలో మార్పునకే ఆత్మీయ సమావేశాలు

చుండూరు(వేమూరు): విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొని రావటానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగిందని మండల విద్యాశాఖాధికారి సలోమన్ అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో శనివారం తలిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీ విద్యా సాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పటల్స్ పలమనాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా ఫార్మశీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలికాలంలో దగ్గు, జలుబు, పెద్దవారిలో ఆస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నియంత్రించవచ్చని చెప్పారు. సమావేశంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ ముక్తార్ అహ్మద్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ, శ్రీ పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజర్ శ్రీనివాసరావు, డాక్టర్ షారోన్ లిల్లీ, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ దుర్గారావు, వల్లి పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

ట్రైన్‌లో వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు




భట్టిప్రోలు: ఈ నెల 5వ తేదీన డెల్టా సూపర్ ఫాస్ట్ ట్రైన్‌లో భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో ఎక్కిన 42 సంవత్సరాల వయస్సు కలిగిన బండి వీర శంకర్ తెనాలి రైల్వే స్టేషన్ దాటిన తరువాత ఆచూకి తెలియలేదని కుటుంబ సభ్యులు తెనాలి జీఆర్పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రికి శనివారం ఫిర్యాదు చేశారు. 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, నలుపు, తెలుపు, ఫుల్ గడ్డం, ఎర్రటి ఛాయ కలిగి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

జీడీసీసీబీ విశ్రాంత ఏజీఎం మృతి



తెనాలి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజరు (ఏజీఎం) చెరుకూరి వెంకట సుబ్బారావు (87) శనివారం స్థానిక చినరావూరులోని స్వగృహంలో మృతిచెందారు. వీరికి భార్య ఉన్నారు. స్వస్థలం కొల్లూరు మండల గ్రామం రావికంపాడు. తెనాలి మహాప్రస్థాన సేవాసమితి కార్యవర్గ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. చినరావూరులోని శివాలయం జీర్ణోద్ధరణలో ముఖ్యపాత్ర వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేశారు. వీరి అంత్యక్రియలు ఆదివారం ఉదయం చినరావూరు మహాప్రస్థానంలో జరుగుతాయని మహాప్రస్థాన సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామ కృష్ణప్రసాద్ తెలియజేశారు.

శలపాడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం



చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడులో శనివారం వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వరరావు హాజరైన కార్యక్రమానికి వ్యవసాయ శాఖాధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు. శలపాడు గ్రామానికి చెందిన రైతు సతీష్, ఐదు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. అతడి వరి పొలంలో కోత ప్రయోగం నిర్వహించారు. దీని ప్రకారం 38 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు పీఎండీఎస్ వేయడం వలన ఎరువుల భారం తగ్గుతుందని రైతులకు అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. పంట కోత ప్రయోగంలో ఏఓ బి.శ్రీనివాస నాయక్, యూనిట్ ఇన్‌చార్జి అభిలాష్, మైలా వెంకట రామరాజు, వాసవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో శనివారం జరిగింది. నారాకోడూరు గ్రామానికి చెందిన వి.రవికుమార్ ద్విచక్ర వాహనంపై వస్తున్న సందర్భంగా వేజండ్ల అడ్డరోడ్డు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో రవికుమార్ కాలి విరిగి ఫ్యాక్చర్ అయింది. గాయాలైన క్షతగాత్రుడిని 108లో వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఏర్పాటు

చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చుండూరు మండలంలోని చుండూరు, పెదగాదెలవర్రు, వేటపాలెం, కేస్‌పల్లి, అంబేడ్కర్ నగర్ గ్రామాల్లో గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులతో గ్రామ కమిటీ వేయడం జరిగింది. ఈ సందర్భంగా వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ చుండూరు మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల అరాచకాలు ఎక్కువ కావడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారన్నారు. అందువల్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం జరుగుతుందన్నారు. ఎలాంటి అరాచకాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంచి పాలన అందించడం జరిగిందన్నారు. టీడీపీ అధికారం చేపట్టి ఆరు నెలలవుతున్నా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అరాచకాలు తప్ప ప్రజలకు మేలు చేసే పాలన అందించడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు బిల్లులు చెల్లించకుండా, రోజూ విద్యార్థులకు ఉన్నతమైన భోజనం పెట్టకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులను ఒత్తిడి చేసి ఉన్నతమైన భోజనం పెట్టించడం జరిగిందన్నారు. చుండూరు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఈమని వీరారెడ్డి, పెదగాదెలవర్రు గ్రామ అధ్యక్షుడిగా మూల్పూరు స్వామి, వేటపాలెం అధ్యక్షుడిగా చుండూరు నరేష్, కేస్‌పల్లి అధ్యక్షుడిగా ఊరుబండి కోటేశ్వరరావు, అంబేడ్కర్ నగర్ గ్రామ అధ్యక్షుడిగా జాలాది సురేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు అనపురెడ్డి రఘురామి రెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, అంబేడ్కర్ నగర్ భాస్కర్, చుండూరు సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, కొండ శివప్రసాద్ రెడ్డి, గాదె శివరామకృష్ణ రెడ్డి, మాజీ ఎంపీపీ డి.వీరయ్య, మాజీ సర్పంచ్ జాలాది రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చుండూరు గ్రామ కమిటీలో వరికూటి అశోక్‌బాబు

అపరాల సాగులో రైతులను అప్రమత్తం చేయాలి

ఏరువాక కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ బాల మురళీధర్ నాయక్

రేపల్లె రూరల్: రబీ సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు అవలంబించేలా వ్యవసాయ అధికారులు అప్రమత్తం చేయాలని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ బాల మురళీధర్ నాయక్ అన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బందికి సామర్ధ్యం పెంపుపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రబీ సాగులో పండించే మినుము, మొక్కజొన్న, జొన్న పంట విత్తనాలు ఎంపిక, సాగు సమయంలో నీటి నిర్వహణ పద్ధతులు, చీడపీడల నివారణ, మందుల వినియోగం తదితర అంశాలను రైతులకు వివరించాలన్నారు. అధిక దిగుబడులు సాధించే విధంగా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై, వారి సామర్ధ్యాలు పెంపుపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ హుస్సేన్, రేపల్లె ఏడీఏ ఆర్.విజయ్‌బాబు తెలిపారు.



మాట్లాడుతున్న ఏరువాక కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ బాల మురళీధర్‌నాయక్

బోద వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోవాలి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: బోద వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. బోద వ్యాధి నివారణలో భాగంగా బీసీ కాలనీలో శుక్రవారం రాత్రి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 300 బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించడం జరిగిందన్నారు. వీటిని పరీక్షలకు పంపినట్లు చెప్పారు. బోద వ్యాధి వ్యాప్తి ఏ మేరకు ఉందనేది ఈ పరీక్షల్లో తేలనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, తిరువీధులు రాంప్రసాద్, మున్నంగి రత్నాకరరావు, షేక్ బషీద్, తదితరులు పాల్గొన్నారు.



రక్తపూతల నమోనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నిబద్ధతగల యోధుడు పరుచూరి

వర్ధంతి సభలో ప్రజాసంఘాల నేతల నివాళి

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పరుచూరి నాగేశ్వరరావు వర్ధంతిని శనివారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమంలో జిల్లా నాయకులు కీలకపాత్ర పోషించారనీ, కమ్యూనిస్టుల నాయకత్వంలో కష్టజీవుల పోరాటాలెన్నో జరిగాయని చెప్పారు. పదిహేనేళ్ల వయ సులోనే పరుచూరి నాగేశ్వరరావు యువజన సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలకపాత్రను పోషించారని గుర్తుచేశారు.

ఇంటర్‌లోనే పార్టీ సభ్యత్వం తీసుకుని పాలెర్లు, వ్యవసాయాకూలీల సమ్మె కు నాయకత్వం వహించినట్టు చెప్పారు. తెలంగాణా సాయుధ పోరాటంలోనూ పాల్గొని, కాల్చివేత ఉత్తర్వులతో మూడేళ్లు రహస్యజీవితం గడిపినట్టు తెలిపారు. 1962, 1974లో రెండుసార్లు జైలు జీవితం గడిపారని చెప్పారు. దీర్ఘకాలం తెనాలిడివిజన్ కార్యదర్శిగా, జిల్లా కమిటి కార్యదర్శివర్గభ్యులుగా బాధ్యతలు నిర్వహించిన నాగేశ్వరరావు, నమ్మిన సిద్ధాంతం కోసం చివరివరకూ పని చేశారని వివరించారు. రైతుసంఘంజిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యంతోపాటు సమాజాన్నీ నాగేశ్వరరావు అధ్యయనం చేశారని చెప్పారు. శ్రమజీవుల కోసం ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు.

దాల్‌మిల్ ముఠా కార్మిక సంఘం నాయకులు ఎ.వెంకటసుబ్బయ్య, కె.శ్రీనివాసరావు, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు పి.జోనేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మంగళగిరి వెంకటేశ్వర్లు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు కె.దుర్గాప్రసాద్, మహిళా సంఘం నాయకురాలు ఎస్.రాజ్యలక్ష్మి సీఐటీయూ నేత షేక్ హుస్సేన్‌వలి పాల్గొన్నారు. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయం

తెనాలిరూరల్: తెనాలిలో మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం అధికారులు పట్టుకున్నారన్న ప్రచారం శనివారం రాత్రి జోరుగా సాగింది. ఓ మద్యం దుకాణాన్ని నిర్ణీత సమయంలోగానే మూసి వేయడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. తెనాలి మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి నయనతార ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సుల్తానాబాద్‌లో లాజ్ విక్రయాలు, స్టేషన్ వద్ద నీళ్లు కలిపినట్టు ఉన్న మద్యాన్ని అధికారుల బృందం గుర్తించిందన్న ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు మాత్రం వివరాలు తెలిపేందుకు విముఖత వ్యక్తం చేశారు. మద్యం పలుచగా ఉందన్న విషయం తెలిసింది మినహా ఎటువంటి ఫిర్యాదు/సమాచారం లేదని ఎక్సైజ్ ఎస్‌ఐ ఫణికుమార్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరుకు చెందిన 24 ఏళ్ల యువతి తెనాలిలోని కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కు రోజు వస్తుంది. ఈ నెల 5వ తేదీన ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన ఆమె కనబడకుండపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించారు. లాభం లేకారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు

పట్నంబజారు: వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. సుద్దపల్లి డొంకలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే విశ్వనాథం రాజారావు, వెంకటేశ్వర్లు ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. లావాదేవీల నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం జరిగింది. శనివారం రాజారావుపై వెంకటేశ్వర్లు తన నివాసం వద్ద పెట్రోలు పోసి నిప్పంటించాడు. గాయాలపాలైన రాజారావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.